# ఉద్యోగాంతమునందు...

ఇచ్ఛాపురపు రామచంద్రం



"నేను టైరవలేదు. ఇది నిజం. కావాలంటే మీరే చూసుకోండి. పరీక్షకు పంపుకోండి. నా నడుం ముడతేనా లేకుండా ఎంత చదునుగా చక్కగా వుందో కళ్లారా కాంచండి. తృప్తి చెందండి. మా ఆవిడ నడుం మాత్రం చూడొద్దు. పెళ్ళికీ, పెళ్లయిన ఏడాది వరకూనూ ఆమె – ఔను. ఆమే! సన్నగా, పొడవుగా... బంగారు తీగె చెరుగ్గడలా వుండేది. నేనేమో

మరి – పదవీ విరమణ చెయ్యడమని ఎలా అనగలరూ ఎవరయినా... నేనైనా?'' సూటిగా ప్రశ్నించాడు సుబ్బారావ్, తెగించినవాడికి తెడ్డే లింగమన్నట్లు.

''ఐతే నేనేమీ చెయ్యలేను. నిన్ను జూన్ ముప్ఫయిన పంపించెయ్యకపోతే... రిటైర్ చేయకపోతే... ఆ నేరానికి నన్ను గెంటేమంటారు. తనకు మాలిన ధర్మముండదు కదా. ఒకటి జులై నుంచి అటెండెన్స్ రిజిష్టరులో నీ పేరుండదు. నీ సీటులో మరెవరో పడుకుంటారు. ఆపైన నీ యిష్టం'' అని కర్ర విరిచి పొయ్యిలో పెట్టినట్టు చెప్పేసి చేతులెత్తేశాడు ఆఫీసరు.

సుబ్బారావ్ ఉద్యోగుల యూనియన్ వద్దకు వెళ్ళి – ''నేను పనిచెయ్యగలను. నన్ను బలవంతంగానూ నా యిష్టాన్నీ శక్తిసామర్థ్యాలని లెక్కచెయ్యకుండానూ అధికారులు నాచేత పదవీ విరమణ చేయించడం అన్యాయం. దీని నెదుర్కునేందుకు నా తరఫున పోరాటం చెయ్యరా?'' అన్నాడు.

''చెయ్యం. చెయ్యకూడదు...'' అన్నారు యూనియన్ ప్రెసిడెంటూ, సెక్రటరి జాయింటుగా. జూన్ 30న ఆఫీసులో చిన్న సభ ఏర్పాటుచేసి... సుబ్బారావు మెడలో దండేసి... చేతిలో పండెట్టి నాలుగు పొగడ్తలు పొగిడి... ఆడపిలకు అత్తారింటికి దారిచూపించినట్లు సుబ్బారావును ముప్ఫయ్యారేళ్ళ పుట్టింటి నుంచి తగిలేశారు ఆఫీసువారు.

జులై ఒకటో తేదీ నుంచి సుబ్బారావు కష్టాలు మొదలయ్యాయి.

***

ఉదయం... వేళకి కాఫీనీళ్ళు పొయ్యలేదు సరి కదా... అరగంట ఆలస్యం చేసి –

''కాఫీకి వంటింట్లోకి రండి'' అని కెనడియన్ ఇంజిన్‌లా ఆవిడ కేక.

'అధికారాంతంబున చూడవలె అయ్యగారి పస' అనే పద్యపాదం ఠక్కున మెదిలింది సుబ్బారావ్ మెదడులో. అతను వంటింట్లోకి వెళ్లాడు.

''రోజూ కాఫీ నా దగ్గరకొచ్చేది కదా? ఇవాళ నేను కాఫీ దగ్గరకెందుకు రావాలీ?'' గొణుక్కున్నాడు. ఆలిముందు – ఆ అంటే అపశబ్దం, ఊ అంటే ఉపశబ్దం కదా?

''మీరు రిటైరైపోయారుగా'' అందావిడ సన్నగానే నోరు మూసుకో అన్నట్లు.

ముందు మగాడు. ఆపైన మొగుడు. ఇంకా పైన – రిటైరైనవాడు. ఆమీదట ఆవిడ ఏనుగూ అతను ఎలకా. అంతేకాక అంతిమ విజయం ఆవిడదే అని చక్కగా అర్థమైనవాడు. అందుచేత – 'ఊరుకున్నంత ఉత్తమం లేదు, బోడిగుండంత సుఖం లేదు' అని సరిపెట్టేసుకుని మౌనం వహించేశాడు.

''సెల్ఫ్ సెల్ఫ్‌జ్ ద బెస్ట్ హెల్ప్ అన్నారు షేక్స్పియర్, మిల్టన్... మరెవరో. మీరు సహకరించాలి. ప్రజల వద్దకు కాఫీ కాక కాఫీ వద్దకు మనిషి. సెల్ఫ్ సర్వీస్'' అందావిడ.

సహకరించక చస్తానా? – చచ్చినట్టు సహకరిస్తాను అనుకున్నాడతను మనసులో.



''హత్య జరగడానికి ముందు రోజు రాత్రి ఎక్కడున్నావ్?'' అడిగాడు లాయర్.
''హత్య జరిగిన రోజు ఇంట్లోనే వున్నానండీ'' చెప్పాడు ముద్దాయి.
''నేనడిగింది హత్యకు ముందు రోజు రాత్రి...'' రెట్టించి అడిగాడు లాయర్.
'' ఏమయ్యా! గుండ్రాయిలా అలా కూచుంటే కుదరదు. హత్యకు ముందురోజు రాత్రి నేనెక్కడున్నానో చెప్పిచావు'' అన్నాడు ముద్దాయి అక్కడ కుర్చీలో కూచున్న తన లాయర్‌ని కొరకొర చూస్తూ.

''అన్నట్లు... వొచ్చే నెల్నుంచి పనిమనిషిని మానిపించేస్తాను''

''ఏమి?''

''మీరున్నారుగా రిటైరయి? పనిమనిషెందుకు? మీకెలాగా సంపాదన వుండదు. ఖర్చు తగ్గించడమన్నా సంపాదించడం లాటిదే''.

''మరి – నువ్వేం చేస్తావూ?''

''హాయిగా టీవీ చూసుకుంటాను, వంటింటాఫీసు నుంచి రిటైర్మెంటు తీసుకుని. ఊరికే కూర్చుంటే మీకు తోచనూ తోచదు, వొంటికీ మంచిది కాదు. ఏమంటారు?''

ఏమనగలడా భర్త ప్రాణి? అతనేమీ అనలేడనీ ఆమెకి తెలుసు. అతను వేడివేడి కాఫీని చల్లని మంచినీళ్లలా గటగట తాగేసి – 'కటకటా, ఎన్ని ఇక్కట్లు రిటైరైనవాడికి!' అనుకుంటూ కటకటాల వరండాలోకి వొచ్చి కూర్చుని ఆకాశంవేపు చూస్తూ ఆలోచించసాగాడు. గొడ్డు గోతిలో పడితే నలుగురూ నాలుగు రాళ్లేసినట్లు, మొగుడు రిటైరై ఇంట్లో పడితే ఇల్లాలు అతని నెత్తిన నలభై పనులేస్తుంది కాబోలు. పని లేదనేగా ఆవిడ తనని అలుసు చేస్తూంది? రిటైరవడమంటే – పనిలేని మంగలి కావడమన్నమాట. పూర్వకాలం క్షురకులకి పని లేకపోవడం వుండేది కాదు కానీ, కంప్యూటర్లూ, గ్లోబలైజేషనూ వొచ్చిపడ్డాక మల్టీనేషనల్ కంపెనీలు క్షురకర్మని కూడా ఆక్రమించేశాయి. ఎక్కడ చూసినా కంప్యూటరైజ్‌డ్ కటింగ్ సెలూన్‌లూ, డిజిటల్ షేవింగ్ సెంటర్లూ, షేవ్ అండ్ క్రాఫ్ట్ కేఫ్‌లూ, టెక్నికల్ హాండ్స్‌కే కాని అన్‌స్కిల్డ్ బార్బర్ హాండ్స్‌కి పనిలేకపోయింది. పనిలేని మంగళ్లు తెగ తయారైపోతున్నారు రోజురోజుకి. పనిలేని మంగలి – పిల్లి బుర్ర గొరిగాడన్న సామెత గుర్తొచ్చి, దానిమీద అనేక సందేహాలు కలగసాగాయి. తను – పిల్లి బుర్ర గొరగాలా? మనుషులకే జాగా మిగల్చని ఈ జనాభా దేశంలో – జూలోనో బొమ్మల్లోనో తప్ప పిల్లులు దొరుకుతాయా? అసలు పిల్లులు షేవింగూ, కటింగూ చేయించుకుంటాయా? అంత జుట్టుకాని, గడ్డంకాని పెరిగిన పిల్లిని జన్మలో చూడలేదు. మీసాలు తెగ పెరిగిన పిల్లులని చూశాడు చిన్నప్పుడు పల్లెటూళ్లో. అప్పుడే... అక్కడే... గాడిదలు పరస్పర క్షవరం చేసుకోవడం.. అంటే ఒకదాని పెరిగిన వెంట్రుకలని మరొకటి పళ్లతో పీకెయ్యడం చూశాడు.

'కుక్కలకి ప్రత్యేకం' అనే బోర్డు గల హెయిర్ కటింగ్, ట్రిమ్మింగ్ సెలూన్లున్నాయి.

'కుక్కస్నానం పాయింట్'లు కూడా వున్నాయి.

పిల్లికి – గొరిగించుకోవలసినంత జుత్తు ఎందుకు పెరగదు? అనే అంశంమీద పరిశోధన చెయ్యాలని నిశ్చయించుకున్నాడు సుబ్బారావ్, ఆ నెపంతో ఇల్లు పట్టకుండా తిరుగుతూ పనులు తప్పించుకోవచ్చని, పెళ్లానికి పగలేనా దూరంగా వుండొచ్చని.

''పనిమనిషొచ్చింది, అంట్ల గిన్నెలు పడెయ్యండి'' ఆజ్ఞ అరిచింది ఆవిడ.

ఇవ్వాళ్టి నుంచే ట్రెయినింగా! అనుకుంటూ లేచిన సుబ్బారావు – ఓ పిల్లికేనా బుర్ర గొరగాలని గట్టిగా నిర్ణయం తీసుకున్నాడు.

అదృష్టం బాగుండి (బాగుండక?) మర్నాడే ఓ పిల్లి కనపడింది. సమయానికి ఇంటావిడ ఎక్కడికో వెళ్లడం అతనికి బాగా కలిసొచ్చింది. మ్యావ్ మ్యావ్ అంటూ మిమిక్రీ చేస్తూ.. పాలగిన్నె ఆశ చూపాడు ఆ పిల్లికి. అది పాలు తాగుతూంటే... పిల్లి కళ్లు మూసుకుని కదా పాలు తాగుతుందని – వెనకనుంచి పట్టుకున్నాడు. అది అతన్ని గీరి, రక్కి, కరిచి పారిపోయింది క్షవరానికి అందకుండా. చిన్నప్పుడు మంగలికి చిక్కకుండా అల్లరి చేసిన రోజులు గుర్తుకొచ్చాయతనికి.

అంతలో ''ఆ రక్తాలేమిటి వొంటినిండా?'' అంటూ వొచ్చిందావిడ.

''పిల్లి... పాలు.. తల గొరగబోతే..''

''ఏమిటీ.. వొట్టి అయోమయమూ అడవి పంచాంగమూ. చేసిన నిర్వాకం చాలు కానీ డాక్టరు దగ్గరికి పదండి. ఆ పిల్లి కరుపులకి ఏ సెప్టిక్కో అయి మీరు పోతే నేను విధవనవ్వాలి. ఉప్పుడుపిండీ, చన్నీళ్ల స్నానమూ నాతరం కాదు'' అని ఆవిడ అతన్ని బరబరా డాక్టరు వద్దకు లాక్కుపోయింది.

రిటైరయ్యాక రెండు రోజులు గడవడమే ఇంత కష్టమైందే... ఇంకా ఎన్నాళ్లు గడవాలో? అని విచారిస్తూ కన్నీళ్లు పెట్టుకుంటున్న సుబ్బారావుని – ''బాధగా వుందా? డోంట్ వర్రీ. బాధా నివారిణి మాత్రలిస్తానుగా'' అని ఓదార్చాడు డాక్టరు.

నా బాధ వేరు – అని ఏడవలేక నవ్వాడు సుబ్బారావ్.

★